క్లుప్తంగా

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

మాడుగులపల్లి : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ నరేష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనాలని, వ్యాపారుల నుంచి వెంటనే రసీదు తీసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయాధికారులతో కలిసి త్వరలో మండలంలోని అన్ని ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యాపారులు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొండమల్లేపల్లి సీఐకి డీఎస్పీగా ప్రమోషన్



కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి సీఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ డీఎస్పీగా ప్రమోషన్ పొందారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పలువురు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పించింది. ఈ క్రమంలోనే డీఎస్పీగా పదోన్నతి పొందిన శ్రీనివాస్‌కు పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

అడవిదేవులపల్లి : మండలంలోని ఉల్సాయిపాలెం గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. బాధితుడు సీలోజు సత్తయ్య మాట్లాడుతూ ఉల్సాయిపాలెం గ్రామ శివారులో రోడ్డు వెంట మేతకు వెళ్లగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతంతో మృతి చెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.60వేల వరకు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు.

విద్యార్థికి సన్మానం



తనుజ్‌నాయక్‌ను సన్మానిస్తున్న గిరిజన శక్తి నాయకులు

మిర్యాలగూడ టౌన్ : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా ఎస్టీ కేటగిరిలో మొదటి ర్యాంకు సాధించిన తనుజ్ నాయక్‌ను గిరిజన శక్తి ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె మధునాయక్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో బంజారా బిడ్డలు రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావూరి రవీందర్‌నాయక్, నాయకులు రాజునాయక్, శ్రీనునాయక్ ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలోని గాజీనగర్ గ్రామ ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా పేట రమేశ్‌మాదిగ, ఉపాధ్యక్షుడిగా బుడిగపాక రవి, ప్రధాన కార్యదర్శిగా వంగూరి లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా పేట రాజులను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోతం సహదేవుడు ఆధ్వర్యంలో గ్రామ శాఖ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మారుపాక గోపాల్, అంకూరి నాగరాజు పాల్గొన్నారు.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు



కొనసాగుతున్న పనులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలో రూ.3.55కోట్ల వ్యయంతో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ రోడ్డును స్థానిక చౌరస్తా నుంచి గౌరికుంటతండా ఎక్స్‌రోడ్డు వరకు నిర్మిస్తున్నారు. ఇప్పటికే రోడ్డు నిర్మాణ పనుల సందర్భంగా విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త లేన్ పనులు పూర్తి చేశారు. దీంతో రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పుంజుకుంది.

హామీలు అమలు చేయాలి

నల్లగొండ టౌన్ : ముఖ్యమంత్రి కేసీఆర్ అనాథలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట అనాథలతో కలిసి దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలను కూడా కేసీఆర్ మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బకరం శ్రీనివాస్, బోడ సునిల్, ఇరిగి శ్రీశైలం, ఆడెపు నాగార్జున, మేడి శంకర్, మడుపు శ్రీనివాస్, మచ్చ ఏడుకొండల్, మోష, వెంకటయ్య, బన్ని, శివ తదితరులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్ నిర్మాణమెప్పుడో!

- 20 ఏళ్ల కిందట స్థలం కేటాయించి నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- నిరుపయోగంగా మారిన భూమి
- ప్రస్తుతం పాత మార్కెట్ భవనంలో కొనసాగుతున్న కార్యకలాపాలు



నిరుపయోగంగా ఉన్న స్థలం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి రెండు దశాబ్దాల కిందట అద్దంకి – నార్కట్‌పల్లి ప్రధాన రహదారి చింతపల్లి రోడ్డు వెంట 16గుంటల భూమిని కేటాయించారు. కానీ నిధులు మాత్రం ప్రభుత్వం ఇప్పటి వరకు విడుదల చేయలేదు. ఆ భూమిలో ప్రస్తుతం పోలీస్ శాఖ కేవలం బోర్డు మాత్రమే ఏర్పాటు చేశారు. అంతేగాక ఆ భూమి నిరుపయోగంగా ఉండడంతో చిన్నపాటి గుడి కూడా వెలిసింది. ఆ గుడిని ఎవరూ నిర్మించారోనని అనే విషయంపై చర్చ సాగుతోంది. మిర్యాలగూడ మండలం 46 గ్రామ పంచాయతీలు, 106 అవాసా కేంద్రాలు కలిగి జిల్లాలోనే పెద్ద మండలంగా రికార్డులోకి ఎక్కింది. అయితే రూరల్ పోలీస్‌స్టేషన్ ప్రస్తుతం పాత వ్యవసాయ మార్కెట్‌లో కొనసాగుతుంది.

బోర్డుకే పరిమితమైన స్థలం

2000 జూలై 29వ అప్పటి జిల్లా కలెక్టర్ మనోహర్ ప్రసాద్ ఆదేశాల మేరకు అప్పటి ఆర్డీఓ కిషన్‌రావు, మున్సిపల్ కమిషనర్‌లకు పోలీస్ శాఖ భూమి కోసం ప్రతిపాదించారు. 2001లో ప్రభుత్వ భూమి ఎక్కడెక్కడ ఎంత ఉన్నదో సర్వే నిర్వహించి నివేదికను అందించాలని మండల రెవెన్యూ శాఖను జిల్లా కలెక్టర్ మనోహర్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేయడంతో సర్వే నిర్వహించిన అనంతరం 2002లో భూమిని పట్టణ సమీపంలో గల అద్దంకి –నార్కట్‌పల్లి చింతపల్లి బైపాస్ రోడ్డులో చింతపల్లి బైపాస్ రోడ్డు వద్ద 626వ సర్వే నంబరులో 16గుంటల భూమిని గుర్తించారు. అనంతరం అద్దంకి –నార్కట్‌పల్లి ప్రధాన రహదారి వెంట ఉన్నందున అన్ని విధాలుగా అనువుగా ఉంటుందనే ఉద్దేశంతో మున్సిపల్ శాఖ సహకారంతో ఆ భూమిని రూరల్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి భూమిని కేటాయించి అందుకు సంబంధించిన పట్టాలను పోలీసుల శాఖ అందించారు. అయితే అప్పటినుంచి ఆ స్థలం నిరుపయోగంగా ఉన్నది. ఈ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో తుప్పుబట్టిన బోర్డుతో ఎక్కిరిస్తుంది. అయితే ఈ ప్రాంతంలో రూరల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు అయితే ఒక వైపు గుంటూరు రోడ్డు, హైదరాబాద్ రోడ్డులతో పాటు ఖమ్మం, సాగర్ రోడ్డులకు కీలకంగా మారనున్నది. అదే విధంగా 46 గ్రామ పంచాయతీలకు ప్రధాన కేంద్రంగా మారే అవకాశం కూడా ఉంది. ఏది ఏమైనా జనాభా ప్రాతిపాదికన పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి విస్తృతంగా సేవలందించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇప్పటికే డాక్యుమెంట్లు ఇచ్చారు. శాఖ నుంచి నిధులు మంజూరు కాగానే వెంటనే పోలీస్ స్టేషన్ నిర్మాణాన్ని చేపడతాం. ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టిని సారించారు. ఈ పోలీస్ స్టేషన్‌లో అన్ని వసతులతో నిర్మాణం జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

– ముత్తినేని సత్యనారాయణ, సీఐ మిర్యాలగూడ రూరల్

పదవులు, పైరవీలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి



మాట్లాడుతున్న కుందూరు జైవీర్‌రెడ్డి

త్రిపురారం : నాగార్జునసాగర్ నియోజక వర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులకు పదవులు, పైరవీలు, ఆస్తులు సంపాధించడంలో ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కుందూరు జై వీర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం జైవీర్ రెడ్డి చేపట్టిన గిరిజన చైతన్య యాత్ర మండలంలోని బడాయి గడ్డ, డొంక తండా, రూప్ల తండా అప్పలమ్మ గూడెం, రాజేంద్ర నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తండాలలో రెండో రోజు కొనసాగింది. ఆయా గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ జెండాలను ఏగురవేశారు. ఈ సందర్భంగా రూప్లా తండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జైవీర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ తీపి మాటలతో మరోసారి మోసపోవద్దని తెలంగాణలో అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, గిరిజనులు నడుం బిగించి కాంగ్రెస్‌కు అండగా ఉండాలన్నారు. జైవీర్‌రెడ్డి పాదయాత్రకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి మద్దతు తెలిపారు. అలాగే రూప్లతండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త ధనావత్ నాగ ఉపాధి హామీ పనులకు వెళ్లిన సమయంలో కాలుకు గడ్డపార తగిలి ఇన్‌ఫెక్షన్ కావడంతో కాలును సగ భాగం వరకు తీసివేశారు. సమాచారం తెలుసుకున్న జైవీర్‌రెడ్డి ఆ బాధితుడిని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ఎంపీపీ పాండమ్మ, జెడ్పీటీసీ భారతీ, లింగా రెడ్డి, బిట్టు రవి కుమార్, భాస్కర్ నాయక్, ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రాం, పాల్గొన్నారు.

ధన్‌సింగ్ నాయక్‌కు జైవీర్‌రెడ్డి పరామర్శ

మండలంలోని రూప్లా తండా గ్రామ పంచాయతీకి చెందిన జిల్లా మాజీ రైతుబంధు సమితి డైరెక్టర్, బీఆర్‌ఎస్ నాయకుడు ధనవాత్ ధన్‌సింగ్ నాయక్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. దీంతో శుక్రవారం గిరిజన చైతన్య పాదయాత్రలో ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కుందూరు జైవీర్ రెడ్డి ధన్‌సింగ్ నాయక్ నివాసంలో ఆయనను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ధన్‌సింగ్ నాయక్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కాగా నాగార్జునసాగర్ నియోజక వర్గంలో జానారెడ్డి అధికారంలో ఉన్నప్పుడు జానారెడ్డికి కుడి భుజంగా పని చేశారు. మారిన రాజకీయ పరిణామాల దృష్ట్యా ధనావత్ దన్‌సింగ్ నాయక్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరి బీఆర్‌ఎస్ నాయకుడిగా కొనసాగుతున్నారు.

మార్కెట్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలి



రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

దేవరకొండ : దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల స్థలంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యూఐ, యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని ప్రధాన రహదారిపై ఆయా విద్యార్థి సంఘాల నాయకులు రాస్తారోకో చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వంగూరి వెంకటేశ్వర్లు, బుడిగ వెంకటేశ్, నేనావత్ కుమార్, సక్కునాయక్, రాహుల్, ఫయాజ్, నరేశ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా లబ్ధిపొందాలనే ఆరోపణలు

గుర్రంపోడు : కాంగ్రెస్ నాయకులు రాజకీయంగా లబ్ధిపొందాలనే సోషల్ మీడియాలో ధాన్యం తరుగు కోతలను ఎమ్మెల్యే నోముల భగత్‌కు ఆపాదిస్తూ ఆరోపణలు చేస్తున్నారని పీఏసీఎస్ చైర్మన్ ఆవుల వెంకన్న అన్నారు. శుక్రవారం గుర్రంపోడు మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పీఏసీఎస్ చైర్మన్‌లు ఉన్న చోట్ల జరిగిన తరుగు కోతల్లో వారి నాయకుడు జానారెడ్డికి వాటా ఉన్నట్లేనా అని ప్రశ్నించారు. తరుగు కోతల్లో పీఏసీఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని, విచారణ జరుగుతుందని వాస్తవాలు ఏంటో తెలిపి రైతులకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నట్లు తెలిపారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకోవాలి



మిర్యాలగూడ టౌన్ : నివాళులర్పిస్తున్న నాయకులు



దేవరకొండలో..

మిర్యాలగూడ టౌన్ : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీని ప్రతీ బీజేపీ కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, నాయకులు బాణావత్ రతన్‌సింగ్‌నాయక్, రేపాల పురుషోత్తం రెడ్డి, కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, రాఘవారెడ్డి, భాష బోయిన అంతయ్య, శేఖర్, కంచుకొమ్ముల వేణు, జానకిరాంరెడ్డి, పులి విద్యాసాగర్ పాల్గొన్నారు.

దేవరకొండ : దేశ సమైక్యత, సమగ్రతకు ప్రాణ త్యాగం చేసిన డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను దేవరకొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓబీసీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి నిఖిల్ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎదుట ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు చేపట్టిన దీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యా సంస్థల స్థలాలను ఆక్రమించి వ్యాపార సంస్థలుగా మార్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, కేతావత్ లాలునాయక్, చెనమోని రాములు, అంకూరి నర్సింహా, కల్యాణ్‌నాయక్, భవాని ప్రసాద్, ఏటి.కృష్ణ, గుండాల అంజయ్య, గాజుల మురళీ, జెల్దా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న మార్కెట్ చైర్మన్ చంద్రా రెడ్డి

త్రిపురారం : మండలంలోని కొణతాలపల్లి గ్రామ పంచాయతీకి చెందిన షేక్ అబుమీయ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రా రెడ్డి మృతుడు అబుమీయ ఇంటికి వెళ్లి మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతికి గల కారణాలను తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కొణతాలపల్లి సర్పంచ్ జొన్నలగడ్డ వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ రవీందర్ రెడ్డి, కామరెడ్డి గూడెం సర్పంచ్ రమేష్ రెడ్డి, నర్సింగ్ నాగయ్య, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రవీంద్రచారి



నాగార్జునసాగర్ : మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రచారి నియామకమయ్యారు. ఆయన శుక్రవారం విధుల్లో చేరారు. నూతనంగా ఏర్పాటైన కళాశాలకు మౌలిక వసతులు సమకూర్చడంతో పాటు విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు తాను నున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దయానంద్

మిర్యాలగూడ : గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ అన్నారు. శుక్రవారం దామరచర్ల సీఐటీయూ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈనెల 24న నల్లగొండలో నిర్వహించే ప్రదర్శనలో గ్రామపంచాయతీ కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. ప్రభుత్వం కార్మికులకు రూ.16వేల వేతనం ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గుర్తింపు కార్డులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కె.కొండల్‌నాయుడు, వాడపల్లి శ్రీరాములు, ఎ.సైదులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సానికి దెబ్బతిన్న ఇళ్లు



తిమ్మాపురంలో గాలి బీభత్సానికి విరిగిపడిన ఇంటి పై కప్పు రేకులు

హాలియా : మూడు రోజుల క్రితం గాలి దుమారంతో కూడిన భారీ వర్షానికి అనుముల మండలంలోని తిమ్మాపురంలో అనేక ఇంటి పై కప్పు రేకులు ఎగిపోయాయి. దీంతో ఆ బాధిత కుటుంబాలకు కన్నీరే మిగిలింది. ఈదురుగాలుల బీభత్సవానికి గ్రామంలో 36మంది కుటుంబాలకు చెందిన రేకుల ఇళ్ల పై కప్పులు ఎగిరిపోయాయి. దీంతో ఆ బాధిత కుటుంబాలు వీధిన పడ్డాయి. జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు రెవెన్యూ అధికారులు గ్రామంలో పర్యటించి గ్రామంలో నాలుగు ఇళ్లు పూర్తిగా దెబ్బతినగా మరో 32 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పూర్తిగా దెబ్బతిన్న బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేలు, పాక్షికంగా దెబ్బతిన్న ఇంటి యజమానులకు రూ.3,200 ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా నివేదికను రూపొందించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఇంటింటికి బీజేపీ



పథకాలను ప్రచారం చేస్తున్న నిఖిల్ ఆనంద్‌జీ

చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంలో 'ఇంటింటికి బీజేపీ' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఓబీసీ ఆలిండియా జనరల్ సెక్రటరీ నిఖిల్ ఆనంద్‌జీ, జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, లాలునాయక్, శివర్ల రమేశ్‌యాదవ్, కృష్ణ, వినోద్, నగేశ్, మహేశ్, వెంకటరమణ ఉన్నారు.

'భారత్ బచావో' సదస్సును విజయవంతం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

దేవరకొండ : నల్లగొండలో ఈ నెల 25న నిర్వహించనున్న భారత్ బచావో సదస్సును విజయవంతం చేయాలని భారత్ బచావో రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా మేధావులు, విద్యావంతులు ఐక్యంగా పోరాటాలు నిర్వహించి డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. దేశంలో మతోన్మాదం పేరుతో కేంద్ర ప్రభుత్వం చిచ్చు పెడుతుందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టపెడుతుందని విమర్శించారు. అనంతరం ఇందుకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, లింగయ్య, యాదయ్య, వినోద్ తదితరులున్నారు.

26నుంచి రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు

చింతపల్లి : ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, సైద్ధాంతిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ శంషొద్దీన్ కోరారు. శుక్రవారం చింతపల్లి ఆదర్శ పాఠశాలలో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. . కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యను ప్రైవేటీకరణ, కాషాయీకరణ చేయడానికి కుట్రలు పన్నుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వట్టికోటి శ్రీకాంత్, డివిజన్ కోశాధికారి వట్టెపు శివకుమార్, శివ, చిన్న, శ్రీను, పాల్గొన్నారు.

ఖాళీ ప్లాట్‌లో చేపల పారబోత



అగ్రిగోల్డ్ వెంచర్ సమీపంలో పారబోసిన చనిపోయిన చేపలు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని నార్కెట్‌పల్లి – అద్దంకి బైపాస్ రోడ్డు వెంట ఉన్న అగ్రిగోల్డ్ వెంచర్ సమీపంలోని ఖాళీ ప్లాట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం చనిపోయిన చేపలను పారపోశారు. దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులతో పాటు సమీపంలో కాలనీ ప్రజలు ఆ దుర్గంధం భరించలేకపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి ఖాళీ ప్లాట్లలో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పార్వతీపురంలో కాలనీని కలుపుతూ తీర్మానం



గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

నిడమనూరు : మండలంలోని శాఖాపురం ఆవాస గ్రామం చెందిన కాలనీని కొత్తగా ఏర్పాటైన పార్వతీపురం గ్రామ పంచాయతీలో కలపడానికి గ్రామ సభలో తీర్మానం చేశారు. మండలంలోని పార్వతీపురం తుమ్మడం, రాజన్నగూడెం, శాఖాపురం రెవెన్యూ గ్రామాల పధిలో పరిధిలో ఉండేది. సర్పంచ్ ఎన్నికలకు ముందుగానే కొత్తగ గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసినప్పుడు పార్వతీపురాన్ని గ్రామ పంచాయతీ ఏర్పాటు చేశారు. కానీ శాఖా పురం పరిధిలో ఉన్న కాలనీలను మాత్రం అందులో కలపలేదు. తుమ్మడం, రాజన్నగూడం గ్రామ పంచాయతీల పరిధిలో ఆవాస గ్రామాలుగా ఉన్న కాలనీలను కలిపి పార్వతీపురం గ్రామ పంచాయతీగా చేశారు. అక్కడి ప్రజల కోరిక మేరకు ఉన్నతాదికారుల ఆదేశాలతో స్థానిక మండల అధికారులు శుక్రవారం శాఖాపురంలో ప్రజాభిప్రాయం కోసం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో సర్పంచ్ బొజ్జ పరిమళ, పార్వతీపురం సర్పంచ్ బ్రహ్మన్న, తహసీల్దార్ ప్రమీళ, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, మాజీ ఎంపీపీ చేకూరి హన్మంతరావు, సూర్యనారాయణ, బొజ్జ లాజి, ప సర్పంచ్ తిరుపతయ్య, మోసా శ్రీను, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద విక్రయాలకు బహిరంగ వేలం



ఆలయం వద్ద వేలం నిర్వహిస్తున్న అధికారులు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని శ్రీ మీనాక్షిఅగస్త్యేశ్వరాలయం ప్రాంగణంలో ఏడాది పాటు కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర విక్రయాలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సిద్దయ్య, ఈఓ జి.కొండారెడ్డి మాట్లాడుతూ 8మంది రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారని తెలిపారు. కొబ్బరికాయల అమ్మకాన్ని జాన్‌పహాడ్‌కు చెందిన కంచారి సైదిరెడ్డి రూ.1,81,000కు దక్కించుకోగా లడ్డూ, పులిహోరను నల్లగొండకు చెందిన కందుల నవీనాచార్యులు రూ.2 లక్షలకు దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ మృత్యుంజయశాస్త్రి, నవీన్, ప్రసాద్, జగదీష్, సైదిరెడ్డి, నాగేశ్వర్‌రావు, ప్రశాంత్, పున్నారావు, తిరుమలరెడ్డి తరుణ్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

నల్లగొండ టౌన్ : వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంతోపాటు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. 1948 కనీస వేతనాల చట్టం ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పెరిగిన ధరల ఆధారంగా వేతనాలను సవరించాలన్నారు. ఈ సమావేశంలో బొజ్జ వెంకులు, నారి ఐలయ్య, సరోజ, లింగస్వామి ఉన్నారు.

యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లేష్‌యాదవ్

నల్లగొండ టౌన్ : బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా మునుగోడు నియోజకవర్గానికి చెందిన నెరటి మల్లేష్‌యాదవ్ నియమితులయ్యారు. మల్లేష్‌యాదవ్‌కు శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్న జిల్లా కేంద్రంలో నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దులు, మాదగోని నరేందర్‌గౌడ్, గుర్రాల పరమేష్, గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ టూటౌన్ : వానాకాలం సీజన్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మున్సిపల్ ఉద్యోగులందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రమణాచారి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వార్డ్ ఆఫీసర్లు ఇతర ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డ్ ఆఫీసర్లు అందరూ వార్డు పరిధిలోని లోతట్టు ప్రాంతాల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద పారిశుద్ధ్య పనులు ఇతర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్, మున్సిపల్ ఈఈ రాములు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతన్న బిజీ..బిజీ



కొండమల్లేపల్లిలో విత్తనాలు విత్తుతున్న రైతులు

కొండమల్లేపల్లి : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతన్నల్లో ఖరీఫ్ జోష్ నింపాయి... మృగశిర కార్తె దాటినా జాడలేని వర్షాలతో దిగాలు చెందిన రైతన్న... నైరుతి రుతుపవనాలు రాకతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కొత్త ఉత్సాహాన్ని నింపాయి.. దీంతో విత్తనాలు విత్తే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఆయా గ్రామాల రైతులు పత్తి విత్తనాలు పెద్ద ఎత్తున విత్తారు.